కంబుశ్రీరామం

పిగ్గమనేని మృత్యుంజయరావు

"ఓ! యకరో! యమ్మకరో! యమక్కరో! యదీ! ఇట్టట్టకో'' తప్పెట్లు, తాళాలతో మైలారు దేవత కొలువు కోలాహలంగా జరుగుతోంది. బుగ్గల్లోంచి కత్తులు గుచ్చుకున్నవాళ్లూ, చర్మంలోకి కొక్కేలు దించుకుని ఉయ్యాలలూగేవాళ్లూ, కొరివి కాల్చి వాతలు పెట్టుకొనే వాళ్లూ... వీళ్లందర్నీ చూస్తూ ఉద్రేకంతో ఊగేవాళ్లూ.. మహాసందడిగా వుంది మైలారు దేవత ఆలయ ప్రాంగణం. ఈ సమూహాన్నంతా కళ్లతో గుచ్చిగుచ్చి చూస్తూ ఎవరి కోసమో వెదుకుతున్నాడు అంబదేవుడు.

అంబదేవుడు కాకతి మహాప్రభువు ప్రతాపరుద్రుని చారదళంలో ముఖ్యుడు. స్వయంగా మహా మంత్రి ఇందులూరి అన్నయ పర్యవేక్షణలో చరించే వ్యక్తి. ప్రభువుల వారికి, మహా మంత్రుల వారికి తప్ప మరెవ్వరికీ బాధ్యత వహించనక్కరలేని ఉద్యోగి.

తనకు కావలసిన వ్యక్తి ఆ దాపుల ఉన్న ఛాయ లేమీ లేకపోవడంతో అక్కణ్ణుంచి సాగి నిదానంగా శివాలయం వైపు కదిలాడు. అక్కడ జానపదులు పల్నాటి వీరగాథలు గానం చేస్తుంటే జనం మైమరిచి వింటున్నారు. అక్కడ కూడా తనక్కావలసిన మనిషి కన్పించకపోవడంతో ఏకవీరాదేవి దేవళం వేపు సాగుతుండగా అతని దృష్టి ఒక యువతి మీద నిలిచింది. ఆ యువతి కూడా తనలాగే ఎవరి కోసమో వెదుకుతున్నట్టుగా కనిపించింది. ఐనా పట్టించుకోకుండా నిదానంగా దిక్కులు పరికించుకుంటూ ముందుకు సాగాడు.

ఎండ నిప్పులు చెరుగుతున్నా ఓరుగల్లు వీధుల్లో జన సంచారానికి కొదువ లేదు. కాకతి దేవి తిరునాళ్లు కావడంతో నగరంలో పండుగ వాతావరణం కన్పిస్తోంది. భైరవాలయం, చాముండేశ్వరి ఆలయం, వీరభద్రేశ్వరాలయం, బౌద్ధాలయం, మస్తానమ్మ గుడి, కొమరసామి గుడి, పాండవుల గుడి, కేశవస్వామి ఆలయం దాటి తురకల మసీదు చేరేసరికి రాజభవనం ప్రాకారాల్లోంచి మిట్ట మధ్యాహ్నమైందని సూచిస్తూ పదహారు గంటలు మోగాయి. మసీదు దాపునున్న తింత్రిణీ వృక్షం నీడకు చేరుకున్నాడు. మైలారు దేవత గుడి వద్ద తారసపడ్డ యువతి కూడా అటువేపే రావడం గమనించాడు అంబదేవుడు. వెంటనే ఆమెకు కన్పించకుండా చెట్టు చాటుకు వెళ్లిపోయాడు.

ఎండ తీవ్రతకు ఉస్సురని నిట్టూర్చుకుంటూ అదే వృక్షం నీడలోకి చేరిందా యువతి. ''మురుగా! సామిని తొరగా సూపించు మప్పా!'' అని పైకే అంటూ తింత్రిణీ వృక్షం బోదెకు చేరబడింది. ఆ పలుకులు చెవినిబడి ఉలిక్కిపడ్డాడు అంబదేవుడు. క్షణకాలంలో ఒక నిర్ణయానికి వచ్చి వెనుకపాటుగా ఆ యువతిని చేరి మత్తుమందు సాయంతో స్పృహ తప్పించాడు. తన చర్యనెవరేనా గమనించారేమోనని క్రీగంట దిక్కులు పరికించాడు. ఎవరూ సమీపంలో కనపడకపోవడంతో తృప్తిగా తలూపి ఆ యువతి శరీరాన్ని మసీదు ఆవరణ లోపలికి చేర్చి ఎవరికీ కనిపించకుండా ఓ ప్రక్కగా పడుకోబెట్టాడు. బయటకు వచ్చి చిత్రధ్వనితో మూడుసార్లు పక్షిలా కూశాడు. గాల్లోంచి ప్రత్యక్షమైనట్టుగా ఇద్దరు భటులు అక్కడకు చేరుకుని అంబదేవునికి అభివాదం చేశారు. మసీదు లోపల వున్న యువతిని మరో కంటికి తెలియకుండా మహా మంత్రుల వారి భవనానికి చేర్చమని ఆదేశించి వడివడిగా అక్కణ్ణుంచి నిష్క్రమించాడు అంబదేవుడు.

* * *

''టిట్టిభా! ఆయన వృత్తి చూస్తే రాజగురువు. ప్రవృత్తి చూస్తే పండితుడు, పరమ నిష్ఠాగరిష్టుడు. వయస్సు చూస్తే షష్టిపూర్తికి చేరినవాడు. అటువంటి మహానుభావునికోసం సాని కొంపల్లో వెదకమంటారేమిటి మహామంత్రులు'' అంటూ కామసాని ఇంటిముందు నిలబడిపోయాడు మంచన శర్మ.

''మిత్రమా! అన్నయ మంత్రుల మేధస్సును అనుమానించాల్సిన పనేముంది! ఐనా సరసుడివి... ఈ పనికి సంబరపడాల్సింది పోయి అనవసరంగా సందేహిస్తావెందుకు?'' అంటూ ముందుకు సాగాడు టిట్టిభసెట్టి.

మంచనశర్మ కాకతీయ రాజ్య మహామంత్రి ఇందులూరి అన్నయ మంత్రికి తమ్ముని కొడుకు. నైష్టికుడైనా శృంగార భోగప్రియుడు. టిట్టిభసెట్టి అతని ప్రాణమిత్రుడు. ఇరువురూ ప్రస్తుతం రాచకార్యం మీదే వేశ్యవాడలలో వెదుకులాటలో పడ్డారు.

''శర్మవారు వాకిటిదాకా వచ్చి లోపలికి దయ చేయకుండానే వెళుతున్నారు. మా అందం చాలదో'' అంటూ కామసాని గొంతు గారాలు పోయింది. ''నీవు వాకిట వుండటం గమనించాను. మరోసారి కలుస్తాను'' అంటూనే ఆగకుండా ముందుకు సాగాడు మంచన. వస్తున్న నవ్వాపు



కుంటూ అనుసరించాడు టిట్టిభుడు.

ముసిముసి నవ్వులతో దారికడ్డుగా నిలబడింది మదాలస. ''బావగారీ ఎండకు ఎలా కందిపోయారో! పన్నీట స్నానమాడి సేద తీరవచ్చు గదా మా ఇంట్లో!'' కళ్ళు తిప్పనివ్వని అందం మదాలసది. దానికితోడు సహజంగా అలవడే విలాస విభ్రమాలు.

''వేశ్యవాడలో ప్రచండ గ్రీష్మతాపం కూడా శరత్కాలపు వెన్నెల చల్లదనంలా వుంటుంది మదాలసా! కార్యాంతర వ్యగ్రుణ్ణయి వున్నాను. మరోసారి నీ దర్శనం తప్పక చేస్తాను. దారి విడు'' అన్నాడు మంచన. ''మాట తప్పరుగా'' అని గోముగా అంటూ దారి వదిలింది మదాలస. నోరు తెరుచుకు చూస్తున్న టిట్టిభుణ్ణి చేయిపట్టి లాగుతూ ముందుకు నడిచాడు మంచన.

మధుమావతి మందిరం, లక్ష్మణ వర్ధుల పూటకూళ్లిల్లు, పుష్పలావిక దుకాణం, మదనరేఖ గృహం అన్నీ దాటుకుంటూ తమకు కావలసిన వ్యక్తి ఆయా వాసాల్లో వుండే అవకాశాన్ని పరిశీలించుకుంటూ కామమంజరి నివాసం వద్దకు చేరారు. కామ మంజరి మంచన మనసు గెల్చిన వేశ్య. సకల కళాప్రపూర్ణ, అతిలోక సౌందర్యవతి. తిన్నగా కామమంజరి గృహప్రవేశం చేశాడు మంచన. వెంటనే చెలికాడు టిట్టిభసెట్టి.

చంద్రుణ్ణి చూసిన కలువలా విచ్చుకుంది కామ మంజరి ముఖం. ''ఎన్నాళ్ళకు నాపై దయ కలిగింది?'' అంటూ చేర వచ్చింది. వెనుకనే పరిచారిక చల్లని మజ్జిగతో వచ్చింది. సమీపంలో ఉన్న ఉయ్యాల బల్లపై కూర్చుని దాహం పుచ్చుకుంటూ పొడుగ్గా నిశ్వసించాడు మంచన. మంచన నిరుత్సాహం గమనించి చిన్నబోయింది కామ మంజరి ముఖం.

''మంజరీ! నీవల్ల నాకొక సహాయం కావాలి'' అంటూ ప్రారంభించాడు మంచన. ఈ ధోరణేమిటో అర్థం కాలేదు కామమంజరికి. ఏమైనా మంచన శృంగార దృష్టితో లేడని ఎదో తీవ్రమైన సమస్యా పరిష్కార వ్యగ్రుడై వున్నాడని గ్రహించింది. 'సెలవివ్వండి' అంటూ సావధాన అయింది.

''అరువదేండ్ల వృద్ధు. తేజస్వి. తమిళ బ్రాహ్మణుడు. ఇలాంటి వాలకమున్న వ్యక్తి ఆచూకీకోసం తిరుగుతున్నాను. ఈ వేశ్య వాటికలో ఏ ఇంట్లోనూ అతడున్న జాడలేదు. పోనీ అనుకుంటే రాచకార్యం. సాధించి తీరాలి!'' అంటూ నిట్టూర్చాడు మంచన.

''ఈ మాత్రానికేనా ఇంత చింత జాడ చెబితే

నేహా ఎక్స్‌పోజింగ్

ఖియామత్ సినిమాలో బికిని ధరించి ప్రేక్షకుల మతులు పోగొట్టిన నేహా ధుపియా ప్రస్తుతం జూలీ సినిమాలో ఇంకోసారి అందాలు ఆరవేసింది అందులో ఆమెది వేశ్య పాత్ర. ''కన్యాత్వం వల్ల ఒక స్త్రీ గుణగణాలు లెక్కవేయడం మంచి పద్ధతి కాదు. వర్జినిటిపై నాకు నమ్మకం లేదు. నన్ను సెక్స్ సింబల్‌గా పిలిస్తే దానికి నేను చాలా గర్విస్తాను'' అని బోల్డ్‌గా తన అభిప్రాయాలు చెబుతోంది నేహా.

నాకేమిటి బహుమానం?'' అంటూ ఓరకంట చూసింది కామమంజరి. సంభ్రమంగా లేచాడు మంచన. ఒక్క ఉదుటున కామమంజరిని కౌగిట చేర్చాడు. ''ధనమా! నగలా! రాజాస్థాన పదవులా! కోరుకో! నీ కోరిక ఏదైనా చెల్లిస్తాను. ఎక్కడున్నాడా మహనీయుడు?'' అంటూ తబ్బిబ్బయ్యాడు.

''అవేమీ అక్కర్లేదు మన కుమార్తె మదన రేఖకు ముకుర వీక్షా మహోత్సవం దగ్గరుండి మీరు జరిపించాలి'' అంది మంజరి. ''అది నా బాధ్యత! దానికంతగా అడగాలా! అవశ్యం జరిపిద్దాం. ఇంతకీ ఆ మహానుభావుడు...'' అర్ధోక్తిలో ఆగిపోయాడు మంచన. ''అసూర్యం పశ్య, రాచవేశ్య మాచాల్దేవి మందిరంలో'' చెప్పింది కామ మంజరి.

* * *

మహామంత్రి సౌధంలో ఓ విశాలమైన గది. మధ్యలో ఉన్న పాన్పుపైన అంబదేవునికి చిక్కిన యువతి మైకంలో మునిగి వుంది. సమీపంలో వున్న ఆసనం మీద ఆశీనులై వున్నారు అన్నయ మంత్రులు. చార దళాధిపతి గంగమనీడు ఆ ప్రక్కనే వున్నాడు.

మహామంత్రి కనుసైగ నందుకొని విరుగుడు మందు ప్రయోగించాడు అంబదేవుడు. కనులు తెరచి చూసిందా యువతి. తనున్న పరిస్థితి గమనించుకొని ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి పాన్పు దిగింది.

''భయపడకమ్మా! మేము నీకు శ్రేయోభిలాషులమే. కంబనాచార్యుల వారిని వెదుకుతూ నీవు తమిళ దేశం నుంచి వచ్చావని నేనర్థం చేసుకున్నాను. కంబనాచార్యులు మాకు మిత్రులు. గౌరవనీయులు. ఏవిధమైన సంకోచమూ లేకుండా నీవొచ్చిన పనేమిటో చెప్పు'' అంటూ మృదు గంభీరంగా పలుకుతున్న అన్నయ మంత్రుల వైపు తదేకంగా చూసిందా యువతి. ''వారు కాకతీయ మహామంత్రులు అన్నయామాత్యులు. సందేహించకమ్మా'' అంటూ గంగమనీడు అన్నయ మంత్రుల వారిని పరిచయం చేవాడు.

చటుక్కున వంగి మహామంత్రుల కాళ్ళకు నమస్కరించిందా యువతి. చోళ రాజ్యంలో హృదయ విదారక సంఘటనను వర్ణించడం మొదలెట్టింది.

* * *

తంజావూరునేలే రాజరాజ చోళుని ఏకైక కుమార్తె ఉమాదేవి. రాచకన్య అయినా నిరాడంబర జీవితాన్ని ప్రేమించేది. గొప్ప సౌందర్యరాశి కాకున్నా ఆమె కన్నుల్లో దివ్యమైన తేజస్సు మెరిసేది. రాజ్యంలోని ప్రజల పట్లా, పెద్దల పట్లా ఎంతో బాధ్యతగా వ్యవహరించేది. సేవకులను కూడా ప్రేమగా చూసేది. ఆంధ్ర చోళ రాజుల కుటుంబంలో తన కుమార్తెనిచ్చి తద్వారా కాకతీయ రాజులకు సమఉజ్జీగా గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించాలని రాజరాజ చోళుని అభిమతం.

ఐతే ఎందువల్లనో రాకుమార్తె వివాహానికి సుముఖంగా లేకపోవడం, తన మంత్రీ, పురోహితుడూ ఐన కంబనాచార్యులు కాకతీయ మహామంత్రి ఇందులూరి అన్నయ మంత్రికి సన్నిహిత మిత్రుడు కావడం, ఈ రెండు కారణాలతో రాజరాజ చోళుడు తన మనోరథం నెరవేరే తగు సమయం కోసం నిరీక్షిస్తున్నాడు.

కంబనాచార్యుల కుమారుడు అంబికాపతి సర్వ విద్యా ప్రపూర్ణుడుగా పేరు తెచ్చుకున్నాడు. అపర మన్మథాకారుడై సౌందర్యంలో తనకు తానే సాటి అని పేరుపొందాడు. ఐతే విచిత్రం. అంబికాపతికి సన్యాస దీక్ష తీసుకోవాలనే కోరిక కలిగింది. అంబికాపతి నిర్ణయం కంబన దంపతులకు శరాఘాతమైంది. ఒక్కగానొక్క కొడుకు సన్యాసం తీసుకుంటాననేసరికి ఆ వృద్ధుల మనసు కలతపడింది. కొడుకు మనసు మార్చాలని ఎంత ప్రయత్నం చేసినా అంబికాపతి దృష్టి సన్యాస దీక్ష నుండి మరలలేదు.

అప్పుడు కంబన ''నాయనా! రేపు ఏకాదశి పర్వదినం. నీవు జగదీశ్వరాలయానికి వెళ్లి పరమేశ్వరునికి అభిషేకమాచరించు. ఆ స్వామి నీకు తగిన మార్గం చూపిస్తాడని నాకు నమ్మకముంది'' అని చెప్పాడు.

తండ్రి మాట మేరకు జగదీశ్వరునికి అభిషేకమాచరించి ఆలయ ప్రాకారం దాటి వెలుపలికి వస్తున్న అంబికాపతికి ఒక ఘోర దృశ్యం కంటబడింది. స్వామివారి భద్ర గజం ఉన్మాదిలా రాజమార్గంలో స్వైర విహారం చేస్తోంది. మావటిని విసిరికొట్టడంతో కాళ్లు విరిగి లేవలేని స్థితిలో పడివున్నాడతను. అదికాదు అతని దృష్టిని ఆకర్షించింది. ఉన్మత్త గజం ఉన్మాదిలా విహరిస్తుంటే నిశ్చేష్టయై భీతహరిణిలా వున్న ఒక యువతి అతని దృష్టినాకర్షించింది. బాణంలా దూసుకుపోయి ఆ యువతిని తన దృఢ బాహువల్లరిలోకి చేర్చి రెప్పపాటులో ఆలయ ప్రాకారంలోనికి చేర్చాడు. నిలువెల్లా భయకంపిత అయిన ఆ యువతి అంబికాపతిని లతలా పెనవేసుకుని పోయింది. అలా మొగ్గ తొడిగిన ఆ పరిచయం పెరిగి పెద్దదై ప్రేమగా వికసించింది. ఆ యువతి రాకుమార్తె ఉమాదేవి.

* * *

తన కుమార్తె ఒక పురోహితుని కుమారుని ప్రేమలో పడటం రాజరాజ చోళుడు సహించలేకపోయాడు. పైగా ఈ ప్రేమ తన భవిష్యత్ రాజకీయ వ్యూహాన్ని కూడా చిన్నాభిన్నం చేస్తుందని గ్రహించాడు. కుమార్తె మనసు మార్చాలని ఎంత ప్రయత్నించినా సాధ్యంకాలేదు పోనీ అంబికాపతిని అంతమొందించాలన్నా కంబనికి రాజ్యంలో వున్న గౌరవాదరాలు తక్కువేమీ కాదు. పైగా కంబని ఉపాసనా బలమే రాజ్యాన్ని కాపాడుతోందనే నమ్మకం కూడా రాజుకు ఒకప్రక్క లేకపోలేదు. ఏమి చేయడానికీ పాలుపోని స్థితిలో పడ్డాడు రాజు.

సన్యాస దీక్ష తీసుకుంటానన్న కుమారుడు వివాహానికి సుముఖుడైనందుకు సంతోషించాలో, రాజకుమార్తెను ప్రేమించి లేనిపోని సమస్యల్ని ఆహ్వానిస్తున్నందుకు విచారించాలో అర్థం కాని అయోమయావస్థలో పడ్డాడు కంబన. కుమారుని మనసు మార్చలేనని ఆయనకర్థమైంది. భారమంతా భగవంతునిపై వేసి కుమారుని క్షేమం కోసం దైవాన్ని ప్రార్థించాడాయన.

* * *

సమస్యను సాగదీసుకోవడం వివేకుల లక్షణం కాదు. రాజనీతి అంతకంటే కాదు. రాజరాజు ఒక నిర్ణయానికొచ్చాడు. నిండు పేరోలగంలో ఒకనాడు రాకుమార్తె వివాహాన్ని ప్రస్తావించాడు.

''రాకుమార్తె ఉమాదేవి కంబనాచార్యుల కుమారుడు అంబికాపతిని వివాహమాడాలని కోరుతున్నారు. ఐతే తండ్రిగా వరుని గుణగణాలను, బ్రాహ్మణ కుమారుడు కావడం చేత అతని పాండితీ ప్రకర్షను పరీక్షించాలనుకోవడంలో తప్పు లేదు గదా'' అంటూ ఆగాడు.

సభ నిశ్శబ్దంగా ఆమోదించింది. ''అందుకే అంబికాపతికి నేనొక పరీక్ష పెట్టదలచాను. మోక్షసాధన గురించి నూరు శ్లోకాలు ఆతడాశువుగా చెప్పగలిగితే అతనికి నా కుమార్తెనిచ్చి వివాహం చేస్తాను, తప్పితే అతనికి శిరచ్ఛేదం చేయిస్తాను'' అంటూ ముగించాడు.

సభ నిర్ఘాంతపోయింది. ఐతే రాజు మాటల్లోని హేతుబద్ధతను అర్థం చేసుకుని సభికులు మౌనం వహించారు. సభలో ఉన్న అంబికాపతి చిరునవ్వుతో ఇందుకంగీకరించాడు.

అర్థంకాని ఆందోళనకు గురయ్యింది, కంబన అంతరంగం. కుమారుని శక్తి సామర్థ్యాల మీద అపారమైన విశ్వాసమున్నా ఏదో తెలియని కలత మనసునాక్రమించింది. తాను నిత్యం ఉపాసించే జగదీశ్వరుణ్ణి మౌనంగా ప్రార్థిస్తూ జరుగుతున్న కార్యక్రమాన్ని చూస్తూ ఉండిపోయాడు.

తెరల వెనుక నున్న ఉమాదేవి సావధాన అయింది. చెలికత్తెతో ఒక పళ్లెరం నిండా మల్లెపూలు తెప్పించింది.

''ఓం నమస్సదసే నమస్సదసస్పతయే నమస్సభేనాం
పురోగాణాం చక్షుషే నమోదివే నమఃపృథివ్యై''

ఓంకార నాదంతో ఉపక్రమణికగా వేద మంత్రం అంబికాపతి నోటి నుండి వెలువడింది. మంత్రాన్ని శ్లోకంగా పొరబడ్డ రాకుమార్తె ఒక మల్లెపూవును జారవిడిచింది. అంబికాపతి ఆశుధారగంగా ప్రవాహంలా సాగిపోతోంది.

శ్లోకానికి ఒక మల్లెపూవును రాకుమార్తె జారవిడుస్తోంది. నూరవ శ్లోకం పూర్తి అవుతుండగానే పట్టలేని ఆనందంతో తెరలు చీల్చుకుని సభాప్రవేశం చేసింది ఉమాదేవి.

ప్రేయసి రాకతో అంబికాపతి ఆశు కవితాధార ఉమాదేవి సౌందర్య వర్ణనగా మారి సాగింది. కుప్పకూలిపోయాడు కంబన. చిరునవ్వు నవ్వాడు రాజు. సభలోని పండితుల మొహాలు చిన్నబోయాయి.

గొంతు సవరించుకున్నాడు రాజు. ''మోక్షసాధన గురించి అంబికాపతి నూరు శ్లోకాలు ఆశువుగా చెప్పాల్సి వుంది''. అయితే అతను చెప్పిన నూరు శ్లోకాల్లో ఉపక్రమణిక కూడా కలిసి వుంది. ఉపక్రమణిక వేదమంత్రమే కాని ఆశువుగా చెప్పిన శ్లోకం కాదు. అందువల్ల అతడు నూటికి ఒకటి తక్కువగా చెప్పినట్లయింది. కనుక అత్యంత బాధాకరమైనప్పటికీ రాజధర్మాన్ననుసరించి అంబికాపతికి శిరచ్ఛేదం చేయాలని నిర్ణయించుకున్నాను'' అన్నాడు. ఉమాదేవి నిలుచున్న పాటున కుప్పకూలి ప్రాణత్యాగం చేసింది.

పుత్రశోకంతో కంబనకు మతిస్థిమితం తప్పింది. సభ నుండి బయటపడ్డ కంబన ఎటు వెళ్ళాడో తెలియని స్థితి. రాజ్యంలో కల్లోలం లేచింది. రాజు కంబనను కూడా చంపించాడనే వదంతులు ప్రబలాయి. ప్రజానీకంలో కంబన పట్ల వున్న గౌరవాదరాలు రాజు పట్ల వ్యతిరేకతగా రూపుదిద్దుకుంటున్నాయి. విస్ఫోటనానికి సిద్ధంగా వున్న అగ్నిపర్వతంలా వుంది ప్రజల మనఃస్థితి.

ఒకవైపు కుమార్తె వియోగ దుఃఖం, మరోవైపు రాజకీయ కల్లోలం. సత్వరం కంబనను వెదకి పట్టుకోకుంటే పరిస్థితులు అదుపు తప్పేలా కన్పించాయి. కంబనకు కాకతీయ రాజ్యంతో వున్న అనుబంధం రీత్యా ఓరుగల్లు వెళ్లి వుండవచ్చునని ఊహించాడు రాజు. అందుకే కంబన పెంపుడు కుమార్తె అయిన జగదంబికను ఓరుగల్లుకు పంపాడు కంబన ఆచూకీ కోసం.

* * *

జగదంబిక చెప్పిన కథ వింటున్న అన్నయామాత్యులు, మిగిలిన రాజ ప్రముఖుల మనస్సులో మెదిలిన ఆలోచన ఒక్కటే! అయితే కంబన ఎక్కడున్నట్లు? కంబన ఓరుగల్లులో ఉండటమే నిజమైతే తక్షణ ప్రమాదం రాజరాజచోళుని దండయాత్ర. తదుపరి ప్రమాదం కంబన ఆరోగ్య స్థితి. ఇలాంటి విషమ స్థితిలో వాకిటి నుండి మంచన స్వరం వినిపించింది.

''జయము ప్రతాపరుద్రదేవరాట్టుకు, కంబనాచార్యులు మాచల్దేవి సంరక్షణలో మతి స్థిమితము లేని స్థితిలో వున్నారు. ఆయన ఎవ్వరినీ గుర్తించలేకున్నారు''

* * *

కాకతీయ రాజ్యంలోని వైద్యులెవ్వరూ కంబనను బాహ్య ప్రపంచంలోనికి తేలేకపోయారు. చివరకు ప్రధాన వైద్యుడు ఒక సూచన చేశాడు. రోగి మనస్సుకు అత్యంత ఇష్టమైన ధ్వనిని విన్పించగలిగితే అతనికి బాహ్య స్ఫురణ రాగల అవకాశం వుందని చెప్పాడు.

ఒకరోజు వేద పఠనం, ఒకరోజు మృదంగ విన్యాసం, మరొకరోజు వీణావాదనం ఇలా రకరకాల ధ్వనులు కంబనకు విన్పించడం జరిగింది. ప్రయోజనం కన్పించలేదు. అప్పుడు అన్నయమంత్రుల మనస్సులో ఒక ఊహ తళుక్కుమంది. బాల్యంలో తామిద్దరూ కేశవస్వామి ఆలయంలో వున్న నూరు జేగంటలను ఒక క్రమపద్ధతిలో మ్రోగించడం... ఆ శబ్దం తనకేవో పూర్వజన్మ స్మృతుల్ని జ్ఞప్తి చేసినట్లుగా వుంటుందని కంబన అంటుండడం ఆయనకు గుర్తుకొచ్చింది. వెంటనే కంబనను తీసుకొని కేశవాలయానికి వెళ్లారు మహామంత్రులు అన్నయామాత్యులు. ప్రతాపరుద్ర ప్రభువు సైతం రాచమర్యాదలను ప్రక్కనబెట్టి పాదచారియై వారిననుసరించారు.

ప్రభువు, రాజ ప్రముఖులు ఉత్సుకతతో చూస్తుండగా అన్నయమంత్రులు కేశవస్వామికి నమస్కరించి జేగంటలు మ్రోగించసాగారు. ఘంటికా నాదం శృతిబద్ధంగా సాగేకొలదీ కంబన మోమున ఒక విచిత్రమైన తేజస్సు మెరుపులీనసాగింది. అప్రయత్నంగా ఆయన ముకుళిత హస్తుడైనాడు. అలవోకగా ఆయన నోటివెంట తమిళ భాషలో ఆశువుగా ఒక గానం వెలువడసాగింది. జేగంటల నాదం ఆగినా కంబన కావ్యగానం ఆగలేదు. చూపరులు, ఆనందం ఆశ్చర్యం కలగలసిన భావాలతో ఆ అద్భుత గానాన్ని ఆస్వాదిస్తున్నారు. అది శ్రీమద్రామాయణంలోని సుందరకాండం.

* * *

క్రౌంచ మిథునపు ఆత్మత్యాగం వాల్మీకి చేత నాడు రామాయణ మహాకావ్యానికి రూపకల్పన చేయించింది. వియోగ దుఃఖానికి రామాయణ కథ ప్రతీక కాబోలునన్నట్లుగా మరల ఇరువురు ప్రేమికుల మరణం నేటికి ఒక తండ్రి చేత రామాయణ కావ్యాన్ని వ్రాయించింది. తమిళ భాషలో చిరస్థాయిగా నిల్చి నేటికీ తమిళ ప్రజానీకానికి నిత్యపారాయణమైన కంబ రామాయణంగా ప్రసిద్ధిగాంచింది.

★

ఇషా సంచలనం

గర్ల్‌ఫ్రెండ్ అనే సినిమాలో లెస్బియన్ (స్త్రీలలో స్వలింగ సంపర్కులు) పాత్రలో నటిస్తూ ఇషా కొప్పికర్ సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయమై ప్రశ్నిస్తే ''సెక్సంటే శారీరకమే కాదు, మానసికంగా కూడా. మగవాళ్లని ద్వేషించే ఒక అమ్మాయిని తిరిగి మామూలు మనిషిని చేసే పాత్ర నాది. అలాంటి అమ్మాయికి శారీరకంగా, మానసికంగా దగ్గరయ్యే కారెక్టర్ వేస్తున్నాను. ఈ సినిమా మంచి పేరు తెస్తుందని నా నమ్మకం'' అంటోంది. ఇషాకి పేరు సంగతేమో కాని మాంచి హాట్‌సీన్స్ వుంటాయని ప్రేక్షకులు ఉవ్విళ్లూరుతున్నారు.